క్లుప్తంగా

30 నుంచి సర్పంచులకు శిక్షణ

సత్యవేడు: తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయంలో సత్యవేడు మండలంలోని మహిళా సర్పంచులకు జూన్ 30 నుంచి జూలై 2వ తేదీ వరకు ఆర్జీఎస్ఏ కార్యాచరణ ప్రణాళికపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ త్రివిక్రమరావు తెలిపారు. మండలంలోని 18 మంది మహిళా సర్పంచులు అందరూ హాజరయ్యేలా పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలని ఆయన కోరారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సత్యవేడు: గాంధీరోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీకళ్యాణ వీరభద్రస్వామి ఆలయ గాలిగోపురం, రాజగోపురాలకు కలశాల ప్రతిష్ట మహా కుంభాభిషేకం పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఇందూరు రవికుమార్ దేవర్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయంలో భక్తుల సమక్షంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మూడు రోజులపాటు ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో భక్త బృందం పాల్గొంది.

గ్రీవెన్స్‌లో సమస్యల వెల్లువ


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చిన మునెమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల ప్రజావేదికలో పలు భూసమస్యలను తహశీల్దార్ శ్రీదేవికి విన్నవించారు. పూసలపల్లి గ్రామానికి చెందిన మునెమ్మ భర్త మరణించాడని, భర్త పేరుతో ఉన్న భూమిని తన పేరుతో మార్చాలని కోరారు. ఇంటి స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని పలువురు విన్నవించారు. భూముల సర్వే, భూముల ఆన్‌లైన్ సమస్యలు, భూ ఆక్రమణలపై ఫిర్యాదులు చేశారు. వినతులను విచారించి, భూ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీదేవి వీఆర్‌ఓలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నల్లయ్య, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ముఖర్జీకి నివాళి


నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో జన సంఘ వ్యవస్థాపకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులర్పించారు. శ్రీకాళహస్తి పట్నం తొట్టంబేడు మండలాల కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. నరేంద్రమోదీ 11 ఏళ్ల సుపరిపాలనపై వివరించారు. ముందుగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ మాట్లాడుతూ దేశం కోసం శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, చంద్రప్ప, కండ్రిగ ఉమ, శైలజ, గోపాల్, ప్రజ్ఞశ్రీ, వెంకటేష్, హరీష్ రెడ్డి, గరికపాటి రమేష్, అమర్నాథ్, డిల్లీకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: మండలంలోని తొండమనాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2024–25లో పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సోమవారం యాదగంటి శోభనాద్రి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది దశరథరామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, ట్రస్టు నిర్వాహకులు రవిశంకర్, ఈశ్వరి, ఎస్ఎంసీ వైస్ ప్రెసిడెంట్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమల్లో బాబు విఫలం


మాట్లాడుతున్న షర్మిల

శ్రీకాళహస్తి: చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇద్దరూ మోదీ దత్త పుత్రులేనని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల అన్నారు. మోదీ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నా దత్తపుత్రులు మాత్రం ఆయనతో అంటకాగుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో భాగంగా సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన షర్మిల శ్రీకాళహస్తిలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక హోదా, పోలవరం, విశాఖ ఉక్కుపై మోదీ మాటిచ్చి ద్రోహం చేస్తున్నా ప్రశ్నించలేని నీచ స్థితిలో టీడీపీ, జనసేన పార్టీలున్నాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాభాల నిమ్మ



నిమ్మ చెట్లు, (ఇన్‌సెట్) నిమ్మ కాయలు

- నిమ్మ పంటపై రైతుల మక్కువ
- ప్రభుత్వం చేయూతనివ్వాలి

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రమైన బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని రైతులు నిమ్మ పంటను సాగు చేసి అధిక లాభాలను ఆర్జిస్తున్నారు. బుచ్చినాయుడుకండ్రిగ గ్రామానికి చెందిన 15 మంది రైతులు 30 ఎకరాల్లో నిమ్మ పంటను సాగు చేస్తున్నారు. గతంలో బుచ్చినాయుడుకండ్రిగ నిమ్మ పంటకు ప్రముఖంగా ఉండేది. గతంలో గ్రామంలో 200 ఎకరాల్లో నిమ్మ పంటను సాగు చేస్తుండేవారు. పదో మైలు గ్రామంలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీలోని దుమ్ము వచ్చి నిమ్మ చెట్లలోని పూతపై పడ్డంతో కాయలు రాక కనుబడి తగ్గింది. అంతేకాక పంటకు తెగుళ్లు ఎక్కువగా సోకడంతో పంట విస్తీర్ణం తగ్గింది. నిమ్మ చెట్ల పెంపకం కోసం నిమ్మ నారుని తిరుపతిలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి ఒక్కో మొక్కను రూ.25కి కొనుగోలు చేసి, తీసుకొచ్చి నాటుతున్నారు. ఆరుతడి పంట కావడంతో మెట్ట భూముల్లోనే నిమ్మసాగు చేస్తారు. నిమ్మనారుని ఎకరాకు 130 మొక్కలు నాటి, ఐదు సంవత్సరాలపాటు పెంచుతారు. ఐదు సంవత్సరాల తర్వాత నిమ్మ చెట్లు


నిమ్మ చెట్లలో ఉన్న నిమ్మకాయలు

కాయలు కాస్తాయి. అప్పటి నుండి 10 సంవత్సరాలపాటు నిమ్మకాయలను కోసు కోవచ్చు. నిమ్మ నారు నాటిన రోజు నుండి ఎకరాకు సంవత్సరానికి రూ.15 వేలు ఐదు సంవత్సరాలకు రూ. 75 వేలు ఖర్చువుతుంది. చెట్లు కాపు వచ్చిన తర్వాత ఎకరాకు సంవత్సరానికి రూ.20 వేలు ఖర్చువుతుంది. ఒక్కో చెట్టు సుమారు వెయ్యి నిమ్మకాయలపైగా కాస్తాయి. నిమ్మకాపు 6 నెలలపాటు ఉంటుంది.

సులువైన మార్కెటింగ్

వాణిజ్య పంట కావడంతో నిమ్మకాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. రైతులు నిమ్మకాయలను చెన్నై, నెల్లూరు జిల్లాలోని గుడూరు మార్కెట్‌లకు తీసుకెళ్లి అమ్ముతారు. నిమ్మ కాయలకు మంచి ధర వస్తే ఎకరాకు అన్ని ఖర్చులు పోను రూ.లక్ష నుండి రెండు లక్షల వరకు మిగులుతుందని రైతులు తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలో మదురై పట్టణంలో నిమ్మ కాయలను ఔషధాల్లో వాడుతారని రైతులు అంటున్నారు. కూటమి ప్రభుత్వం నుండి ఎలాంటి పోత్సాహకాలు అందలేదని రైతులు వాపోతున్నారు. ఆరుతడి పంట కావడంతో విద్యుత్ వినియోగం తగ్గుతుంది. కూలీలతో ఇబ్బంది ఉండదని రైతులు అంటున్నారు. అధిక లాభాలు వస్తుండడంతో రైతులు నిమ్మసాగుపై మక్కువ చూపుతున్నారు.

చీడ పీడలు

నిమ్మ చెట్లకు ఎక్కువ వచ్చే చీడ, పీడలు ఆకు ముడత, కాయకు గంజి మరక, కాయ బొప్పర, పేను బంక, పండు ఆకు, ఎండు కొమ్మ, నల్ల బూడిద, బూడిద తెగుళ్లు సోకుతాయి.

తెగుళ్లను నివారించవచ్చు

స్టాప్, ఓబ్రాన్, ఓమైట్, నెంబరు వన్ కంపెనీలకు చెందిన మందులను నీటిలో కలిపి పిచికారీ చేయాలి. దీంతో నిమ్మ తోటల్లో తెగుళ్లను నివారించవచ్చు.

–శారద, ఉద్యానశాఖాధికారి

సబ్సిడీపై ఎరువులు ఇవ్వాలి



నిమ్మ పంటలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలి. రైతులకు సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులను పంపిణీ చేయాలి. ప్రభుత్వమే కొనుగోలు చేసి ఔషధాల్లో వాడుకోవాలి.

–కోటేశ్వరరావు, రైతు

నిమ్మనారు ఉచితంగా ఇవ్వాలి



నిమ్మచెట్ల పెంపకం కోసం కొత్త నిమ్మ నారుని తిరుపతిలోని ఆచార్యరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంవారు ఉచితంగా ఇవ్వాలి. పాతనారు నాటుతుండడంతో చాలా వరకు దిగుబడి తగ్గుతోంది. కొత్తనారును నాటితే పంట దిగుబడి పెరిగి, ఆదాయం వస్తుంది.

–మునిరాజా, నిమ్మ రైతు

ఆటోలో బడికి విద్యార్థులు


ఆటోలో విద్యార్థులను తీసుకొచ్చిన ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: నీర్పాకోట గ్రామంలోని ఎస్టీ కాలనీలోని పాఠశాలను ప్రైమరీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. నీర్పాకోట, కాంపాళెం గ్రామ పంచాయతీలలోని మూడు పాఠశాలలను ప్రైమరీ పాఠశాలలో విలీనం చేశారు. విలీనమైన పాఠశాలలోని విద్యార్థులను సోమవారం ఎస్టీ కాలనీలోని ప్రైమరీ పాఠశాలకు ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వారి సొంత నిధులతో ఆటోలో పాఠశాలకు తీసుకొచ్చారు. ప్రభుత్వం నిధులు ఇచ్చేవరకు ఉపాధ్యాయులు వారి సొంత నిధులతో ఆటోలకు బాడుగ చెల్లించి విద్యార్థులను తీసుకు వస్తారని ఎంఈఓ తెలిపారు.

అడవి దారిలో అక్రమ తవ్వకాలు


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్

సత్యవేడు: మదనంబేడు రెవెన్యూలోని ఏఎంపురంలో నిర్వహిస్తున్న క్వారీలో భాగంగా రిజర్వు ఫారెస్టుకు వెళ్లే దారిని కూడా అక్రమంగా తవ్వేస్తున్నారని సర్పంచ్ ఎం.శిరీష ఫిర్యాదు చేశారు. సోమవారం తహశీల్దార్ రాజశేఖర్‌ను కలసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. పంచాయతీ పరిధిలో క్వారీ నిర్వాహకులు ఏపీఎంఎంసీ యాక్టు 1966 రూల్స్‌కు పూర్తి విరుద్ధంగా నడుస్తోందని ఆమె తెలిపారు. సర్వేనెంబరు 307లో తవ్వకాలకు అనుమతులు లేవని తెలిపారు. 309 రోడ్డు పొరంబోకు స్థలానికి కూడా అనుమతులు లేవని పేర్కొన్నారు. అయితే ఈ సర్వే నెంబర్లలో గ్రావెల్ తవ్వి అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ స్థలంపై 11 కేవీ లైను ప్రమాదకరంగా ఉంటోందని తెలిపారు. అనుమతి లేని స్థలంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోవాలని తహశీల్దార్‌ను ఆమె కోరారు. వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలి

వరదయ్యపాళెం: కాంబాకం గిరిజనకాలనీ ప్రాథమిక పాఠశాలను విలీనం చేయకుండా యథావిధిగా కొనసాగించాలని ఆ గ్రామానికి చెందిన గిరిజనులతో కలసి తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో డీఈఓకు వైఎస్సార్ సీపీ సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామస్తుల ఇబ్బందిని విన్న డీఈఓ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

పాఠశాలల విలీనాన్ని సమీక్షించండి

రిజర్వుడు నియోజకవర్గమైన సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో పాఠశాలల విలీన నిర్ణయంపై పునస్సమీక్షించాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి జిల్లా డీఈఓకు పరిస్థితులను వివరించారు. 7 మండలాల్లో సుమారు 70 పాఠశాలల వరకు విలీన నిర్ణయంతో మూతపడనున్నాయని ఆయన వివరించారు. దీని కారణంగా ప్రభుత్వ బడుల్లో చదివే పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొంటుందన్నారు. ఇప్పటికే అనేకచోట్ల విలీన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దఎత్తున నిరసనలు వ్యక్తం చేస్తున్నారని, ఈ పరిస్థితులను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ఆయన వెంట నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోలయ్య, ఇతర నాయకులు ఉన్నారు.


ప్రభుత్వ బడుల విలీనంపై విన్నవిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్

ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం

శ్రీకాళహస్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై సీపీఐ రాజీలేని పోరాటం చేస్తోందని ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ మహాసభ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, పేదల విముక్తి కోసం సీపీఐ అనేక రాజీలేని పోరాటాలను చేసిందన్నారు. శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల్లో భూసమస్యలు ఇంటి సమస్యలు పరిష్కార దిశగా చేపట్టి పేదల సొంతింటి కలను నేరవేర్చిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. శతజయంతి ఉత్సవాల సందర్భంగా మహాసభల సందర్భంగా సీపీఐ వంద జెండాలతో ర్యాలీలు, వంద మొక్కలు నాటడం, వంద కాగడాలతో ప్రదర్శన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు రొడ్డ గోపి, జిల్లా ప్రజానాట్యమండలి అధ్యక్షులు చారులత, శాఖ కార్యదర్శులు మునెమ్మ, గంగమ్మ, మునిరాజ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్

సత్యవేడు: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం పాలిటెక్నిక్ కోర్సుల అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. పాలీసెట్‌లో ర్యాంకులు 32,001 నుంచి 50,000 వరకు ర్యాంకులు సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగింది. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పరిశీలనలో రిజ్వాన్, గంగాధర్, ప్రిన్సిపల్ ఉషాదేవి తదితరులు పాల్గొన్నారు.


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

వీరభద్రస్వామి ఉత్సవాలకు ఆహ్వానం

తొట్టంబేడు: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా తొట్టంబేడు మండలం చిన్నసింగమాలలో వెలసిన వీరభద్రస్వామి తొలి ఏకాదశ మహోత్సవాలు జూలై 5వ తేదీ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులును కలిసి కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో కమలనాథ్, కుమారస్వామి, ఓంకార్, ప్రసాద్, గుర్రప్ప పాల్గొన్నారు.


అంజూరు శ్రీనివాసులుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కమిటీ సభ్యులు


మట్టిని తవ్వుతున్న జేసీబీలు


మట్టి తరలిస్తున్న ట్రాక్టర్

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

తొట్టంబేడు: మండలంలోని గుండెలుగుంట పంచాయతీ ప్రభుత్వ పాఠశాల పక్కన ఉన్న విరూపాక్షపురం చెరువులో కూటమి నాయకుల ఆధ్వర్యంలో మట్టి అక్రమ రవాణా చేస్తున్నారు. మూడు రోజులుగా ఎటువంటి అనుమతి లేకుండా రెండు జేసీబీలు, 10 ట్రాక్టర్లతో మట్టి తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఓ కీలక నాయకుడిని ఆయకట్టు చైర్మన్‌గా నియమిస్తే ఆయనే దగ్గరుండి మట్టి అక్రమ రవాణా చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మట్టి అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

పేదలకు మరింతగా వైద్య సేవలు


డాక్టర్ చక్రపాణి

రేణిగుంట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రత్యేక కృషి చేస్తానని డాక్టర్ చక్రపాణి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ముఖ్య వైద్యాధికారిగా డాక్టర్ చక్రపాణి బాధ్యతలను స్వీకరించారు. రేణిగుంటలో పనిచేస్తున్న డాక్టర్ చత్ర ప్రకాష్ రెడ్డి కమ్మపల్లికి బదిలీ కావడంతో వడమాలపేట నుంచి డాక్టర్ చక్రపాణి రేణిగుంట వైద్యాధికారిగా బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో రాత్రి వేళ ఓపీలు పెంచే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామని తెలిపారు.

భూ సమస్యలు పరిష్కరించండి


తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేతలు

శ్రీకాళహస్తి: మండలంలో నెలకొన్న భూసమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు కోరారు. తహసీల్దారు జనార్దన్‌రాజును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకుడు మించల శివకుమార్ మాట్లాడుతూ మండలంలోని అమ్మపాళెం, చుక్కలనిడిగల్లు ఎస్టీకాలనీ, కేపీమిట్ట, సుబ్బానాయుడుకండ్రిగ, తొండమనాడు, భగత్‌సింగ్ కాలనీ, ముచ్చివోలు తదితర గ్రామాల్లో చాలా మంది నిరుపేదలు ఇంటి స్థలాలు లేక ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాల వారు నివసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని కోరారు. ఇక గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజయ్య, సుబ్రహ్మణ్యం, నరసింహారావు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

డీటీగా జీవన్‌కుమార్ బాధ్యతల స్వీకరణ


డీటీ జీవన్‌కుమార్

తొట్టంబేడు: తొట్టంబేడు మండల తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా జీవన్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ నియమితులయ్యారు. ఈయనను పలువురు వీఆర్వోలు ఘనంగా సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వరదయ్యపాళెం: తడ–వరదయ్యపాళెం ప్రధాన రోడ్డు మార్గంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టి ముందు వెళ్తున్న వాహనం కింద పడి ముగ్గురు యువకులు తీవ్ర గాయాలపాలైన ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. మండలంలోని ముస్లింపాళెంకు చెందిన దస్తగిరి, జలీల్ భాయ్, మహ్మద్ హనీఫ్ అనే యువకులు మోటారు బైకుపై తడకు బయల్దేరారు. కడూరు కూడలి సమీపంలో తమ ద్విచక్ర వాహనానికి ముందుగా వెళ్తున్న గ్యాస్ సిలిండర్ల లారీని అధిగమించబోయి ఎదురుగా తడ నుంచి వరదయ్యపాళెం వైపుగా వస్తున్న ఆటోను ఢీకొన్నారు. దీంతో అదే సమయంలో ముందు వెళ్తున్న గ్యాస్ సిలిండర్ల లారీ ఇద్దరు యువకుల వైపుగా రావడంతో కాళ్లు, చేతులు టైర్ల కింద నలిగి, తీవ్ర గాయాల పాలయ్యారు. అటుగా వెళ్తున్న స్థానికుల సహకారంతో వైద్యం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.


ప్రమాదంలో గాయపడిన దస్తగిరి, జలీల్, మహ్మద్ హనీఫ్

పాత్రికేయుడి మాతృమూర్తికి నూకతోటి నివాళి

నాగలాపురం: స్థానిక విలేకరి కృష్ణారెడ్డి తల్లి బుజ్జమ్మ(67) సోమవారం ఉదయం మృతి చెందారు. సమాచారం అందుకున్న సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి నాగలాపురంలోని కృష్ణారెడ్డి ఇంటికి చేరుకుని బుజ్జమ్మ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు అపరంజి రాజు, సర్పంచ్ చిన్నదొరై సుధా, శ్యామ్, మోహన్ మొదలియార్, కులశేఖర్‌రెడ్డి, దేశప్పన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


బుజ్జమ్మకు నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

వైభవంగా ప్రదోష పూజలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా భాసిల్లుతున్న శ్రీసర్వమంగళ సమేత శ్రీపళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రదోష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివ నామ స్మరణతో మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకల్ ఆలయంలోని శ్రీనందీశ్వర స్వామికి, శ్రీవాల్మీకీశ్వర స్వామికి ఏక కాలంలో పూజలు నిర్వహించారు. ఈ ప్రదోష పూజలకు నింద్ర గ్రామానికి శ్రీనివాస మిల్క్ డెయిరీ ఎండీ వాసుదేవనాయుడు, వారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. వారికి ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేసి, ప్రసాదాలు అందించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.లత, ఆలయ సిబ్బంది పరంధామరెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ప్రదోష మండపంలో నందీశ్వరునికి పూజలు

బాధ్యతలు స్వీకరించిన గ్రామ కార్యదర్శులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 10 మంది గ్రామ కార్యదర్శులు సోమవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. మండలంలోని మొత్తం 15 మంది గ్రామ కార్యదర్శులుండగా 10 మంది బదిలీపై వెళ్లడంతో వారి స్థానంలో కొత్తగా 10 మంది కార్యదర్శులు వచ్చారని, మిగిలిన ఐదుగురు పాత వారే ఉంటారన్నారు. గ్రామాల్లోని పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కార్యదర్శులను ఆదేశించారు.


గ్రామ కార్యదర్శులకు ఉత్తర్వులు అందజేస్తున్న ఎంపీడీఓ వెంకటరత్నమ్మ

మండల మహాసభలు జయప్రదం చేయండి

రేణిగుంట: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్నది కమ్యూనిస్టు పార్టీలే అని సీపీఐ జిల్లా కార్యదర్శి పి మురళి స్పష్టం చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం కార్తీక్ అధ్యక్షతన ప్రజాసంఘాల సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మురళి మాట్లాడుతూ సీపీఐ ఏర్పాటై వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రత్యేక ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తాను అని అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వైఎస్ మణి, చంద్రకళ, సుబ్బరాజు, సెల్వ, రమణ, ఖాదర్ బాషా పాల్గొన్నారు.


సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు